10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం 3 అక్టోబర్ 2024 పేజీలు 8




ఎంగిలి పూవు బతుకమ్మ సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శాంతి నగర్‌లో ఎంగిలి పూల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటపాటలతో అలరించారు..

పెన్ పవర్ న్యూస్, సూర్యాపేట, అక్టోబర్ 2:







దుండిగల్ మున్సిపాలిటీ బహుదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.. కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ దీపాలతో అలంకరించాడు.. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మను తయారు చేసి.. పసుపుతో తయారుచేసిన గౌరమ్మను బతుకమ్మపై కూర్చోబెట్టి డప్పుచప్పుళ్ళతో, బతుకమ్మ ఘాటువద్ద మహిళలు స్టెప్పులు వేశారు.. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జి.దామోదర్, కే.అమర్నాథ్, జి.రఘుపతి రెడ్డి, ఎన్. రాజశేఖర్, రాజిరెడ్డి, నర్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 2:


# పూల జాతర షురూ.. బతుకమ్మ ఆడిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ



హైదరాబాద్ పెన్ పవర్:పూల జాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక మన బతుకమ్మ పండుగ వచ్చేసింది. రాష్ట్రంలో పూల జాతర షురూవైంది. ఉరూ...వాడవాడలా సంబురంగా మొదలైంది. పెత్రామాస నుంచి మొదలు దసరాకు ముందు వరకు పల్లె, పట్నం ఉయ్యాల పాటలతో మారుమోగనున్నాయి. ఆడబిడ్డల ఆటలకు యావత్ తెలంగాణ ఊగిపోనుంది. ఎంగిలిపూల బతుకమ్మతో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది రోజుల పూల సంబురం కలర్ ఫుల్ గా జరగనుంది. స్కూళ్లు, కాలేజీలకు కూడా సెలవులు ప్రకటించడంతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఇవాళ ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన జాతర సద్దుల బతుకమ్మతో ముగియనుంది. హైదరాబాద్ తో పాటు రాష్ట్రమంతటా

-2 లో

# చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తం



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగానికీ తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కమ్మ సంఘంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల ఇవాళ (అక్టోబర్ 2) ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మ గాంధీ జయంతి రోజు చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో విదేశీ వస్తు బహిష్కరణ సందర్భంగా దేశ ప్రజల గౌరవాన్ని కాపాడింది చేనేత వృత్తిదారులేనని గుర్తు చేసుకున్నారు. ఆధునిక యంత్రాల ప్రవేశంతో తీవ్రతలు ఎదుర్కొంటున్న పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఇప్పటికే కొనసాగుతున్న చర్యలతో తోడు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# రెండో రోజు 'అటుకుల బతుకమ్మ'



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ సంస్కృతికి చిహ్నామైన పూల సంబరాలు మొదలయ్యాయి. ప్రతి ఇల్లు పూల రంగులతో కళకళలాడుతుంటుంది. ఎటు చూసిన జానపద గీతాల సందడులే. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రజలంతా బతుకమ్మ పండుగకు ఘన స్వాగతం పలికారు. ఈ రోజు సంబరాలు అంబారాన్నంటేలా అంగరంగ వైభవంగా సాగాయి. ఇక రెండో రోజు అంటే ఈరోజున(అక్టోబర్ 03) అటుకుల బతుకమ్మను సిద్ధం చేసి ఆడిపాడతారు. గునుగు పూలు, తంగేడు,బంతి, చామంతి, గుమ్మడి, బీర, కట్ల వంటి పూలతో బతుకమ్మను పేర్చి అందంగా తీర్చి దిద్దుతారు.. గౌరమ్మ పాటలతో రంగురంగుల పూలను కీర్తిస్తూ బతుకమ్మ పండుగ వేడుకగా చేసుకుంటారు. అయితే దీన్ని చిన్నారులే ఎక్కువగా చేసుకోవడంతో ఈ బతుకమ్మకు అటుకల బతుకమ్మ అనే పేరు వచ్చిందని కథనం. అయితే పిల్లలు ఆటకు అటుకులు, పప్పులు, బెల్లమే కదా ఉపయోగిస్తారు. అందుకనే ఈ బతుకమ్మకు చిన్నిపిల్లలు ఇష్టంగా తినే అటుకులనే నైవేద్యంగా సమర్పిస్తారు.



గాంధీజికి నివాళులు అర్పిస్తున్న మేడ్చల్ జిల్లా డిఆర్‌వో హరిప్రియ..



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు.. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారిని హరిప్రియ ముఖ్యఅతిథిగా విచ్చేసి జిల్లా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందితో కలిసి మహాత్మ గాంధీకి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మహనీయుని సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి. సుధాకర్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని డిప్యూటీ కలెక్టర్ కంటే వీణ, మేడ్చల్ కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎల్.రామ్మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.. పెన్ పవర్ న్యూస్, మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, అక్టోబర్ 2:**

# పూల జాతర షురూ.. బతుకమ్మ ఆడిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ

- మొదటి పేజి తరువాయి

బతుకమ్మసంబురాలు వైభవంగా మొదలయ్యాయి. గల్లీలన్ని ఆడబిడ్డల ఆట పాటలతో నేలంతా మురిసిపోతుంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ లోని నక్లెస్ రోడ్ లో బతుకమ్మ సంబురాలు నిర్వహించింది. ఈ వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు సీతక్క. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు బతుకమ్మ ఆడుతూ కనువిందు చేశారు. మహిళలతో కలిసి మంత్రి సీతక్క పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మ సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వరంగల్ లోని తోట మైదానంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద దేవి. తొమ్మిది రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో విధంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది రాష్ట్ర సర్కార్.

## హైదరాబాద్‌లో నేడు భారీ వర్షాలు.. ఎల్లో అలెర్ట్ జారీ




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో నేడు భారీ వర్షం పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. గత నాలుగైదు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రతిరోజూ వర్షాలు కురుస్తున్నాయి. నిన్న హైదరాబాద్, కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలలో భారీ వర్షం కురిసింది. నిన్న కామారెడ్డిలో అత్యధికంగా 97.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని పాటిగడ్డలో 40 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డైంది. నేడు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పిడుగులు కూడా పడే అవకాశం ఉందని హెచ్చరిస్తూ భారత వాతావరణశాఖ (ఐఎండీ) ఎల్లో అలెర్ట్ జారీచేసింది. కాగా, గత కొన్ని రోజులుగా కురుస్తున్న వానలతో హైదరాబాద్‌కు తాగునీటిని అందించే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి.

# భౌరంపేట్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు..



**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 2:** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు భౌరంపేట్‌లో ఘనంగా నిర్వహించారు.. గ్రామంలోని గాంధీ విగ్రహానికి స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు..
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లో మహాత్ముని జయంతి వేడుకల్లో ఘనంగా నివాళులు అర్పించారు..స్థానిక నాయకులు గ్రామపెద్దలతో కలిసి కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్యం, అహింస ఆయుధాలుగా భారత దేశపు స్వేచ్ఛా స్వాతంత్ర్య సమరాన్ని ముందుండి నడిపిన జాతిపిత మహాత్మగాంధీ అంటూ కొనియాడారు.. సమాజ హితమే అభిమతంగా తన జీవితాన్నే త్యాగం చేసిన మహాత్ముడు నడిచిన మార్గం మనకు స్ఫూర్తి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పిఎసిఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, డైరెక్టర్లు భీం రెడ్డి, సత్తిరెడ్డి, మహిపాల్ రెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, మన్నె శేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, విరేశం తదితరులు పాల్గొన్నారు..



- మాజీ ఉద్యోగుల సంఘం నిర్వహించిన ఈ 7వ సమ్మేళనంలో 300 మంది అపూర్వ కలయిక..
- ఏడాది కాలంలో మృతిచెందిన సహోద్యోగులను స్మరించుకుని శ్రద్ధాంజలి ఘటించారు..
- అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జ్యోతి వెలిగించి నివాళులు అర్పించారు..
- 2016 నుంచి ప్రతిఏటా అక్టోబర్ 2న క్రమం తప్పకుండా సమావేశమౌతున్నారు..




# హెచ్.ఎం.టి.మాజీ ఉద్యోగుల..
# అపూర్వ సమ్మేళనం..

సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం.. తరచూ వింటూనే ఉంటాం.. కానీ మాజీ ఉద్యోగుల కలయికతో వార్షికోత్సవాలు జరుపుకోవడం చాలా అరుదు.. అసలు ఉంటాయో..! ఉండవో కూడా సందేహమే..! అయితే ఒకప్పటి సహోద్యోగులు సంఘంగా ఏర్పడి..ఆరు దశాబ్దాల క్రితం కలిసి పనిచేసిన వారంతా..! ఇప్పుడు వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ కలుసుకోవాలనే సంకల్పంతో..! గత ఏడేళ్ళుగా ఈ మాజీ ఉద్యోగుల అపూర్వ కలయికతో వార్శిక వేడుకలు ఘనంగా నిర్వహించు కుంటున్నారు..ఏళ్ళు గడుస్తున్నా కొద్ది ఒకప్పటి తమ సహోద్యోగులు వయసు పైబడిన కొందరు మృత్యువాత పడటం పలువురిని కంటతడి పెట్టిస్తుంది.. అయినప్పటికీ ప్రతియేటా తమను వీడి పరలోకానికి చేరుకున్న మిత్రుల ఆత్మకు శాంతిచేకూరేందుకు ప్రతి అక్టోబర్ 2న స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారు.. అదెక్కడ అనే కదా ఆతృత.. జీడిమెట్ల ప్రాంతంలో హెచ్ఎంటి మాజీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం.. అవును ప్రతిఒక్కరికి ఇలాంటి మాజీ ఉద్యోగుల అపూర్వ సమ్మేళనం కలకాలం కొనసాగాలని కోరుకుందాం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 2:**

### ఆరు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభమైన హెచ్.ఎం.టిలో వివిధ విభాగాల ఉద్యోగులు..







## అలనాటి స్మృతులు నెమరవేసుకున్న పూర్వ ఉద్యోగులు..

జంట నగరాలు, దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు, విదేశాల్లో స్థిరపడిన హెచ్.ఎం.టి. మాజీ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దాదాపు 300 మందికి పైగా ఈ ఏడాది సమావేశానికి హాజరై నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చెప్పారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు, ఉద్యోగినిలు కూడా ఈ సారి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. అందరూ ఒక చోట కలుసుకుని, గత స్మృతులను నెమరువేసుకుంటూ యోగ క్షేమాలు ఒకరు తెలుసుకుంటూ, ఆనందాలను పంచుకుంటూ కాలక్షేపం చెయ్యడం కోసమే ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.వి.మహేశ్ చెప్పారు..

హైదరాబాద్ బేగంపేట పాత విమానాశ్రయం సమీపంలోని రమదా మనోహర్ హోటల్‌కు చెందిన "ఫామిలీ వరల్డ్" బిల్డింగ్‌లో బుధవారం అక్టోబర్, 2వ తేదీ, ఉదయం 10.30 గంటల నుంచి మద్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించిన హెచ్.ఎం.టి. మాజీ ఉద్యోగుల సంఘం నిర్వహించిన 7వ సమ్మేళనంలో సుమారు 300 మందికి పైగా మాజీ ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభమైన హెచ్.ఎం.టి.కి చెందిన వివిధ విభాగాల్లో పనిచేసిన వేల మంది ఉద్యోగులు..! పదవీ విరమణ అనంతరం కూడా హెచ్.ఎం.టి.లో గడించిన అనుభవంతో అనేక సంస్థల్లో ఎన్నో ఉన్నతమైన పదవుల్లో తమ సేవలందిస్తున్నారు.. అటువంటి మాతృ సంస్థతో తమకున్న అనుబంధాన్నీ, అనుభవాలనూ మరొకసారి నెమరువేసుకున్నారు.. సీనియర్ సభ్యులు మ్యాడారం మురళి గణపతి ప్రార్థనతో సభా కార్యక్రమం ప్రారంభమయ్యింది..గత ఏడాది కాలంలో తమను విడిచి అనంత లోకాలకు పయనమైన తమ సహోద్యోగులు, మిత్రులను ఒకసారి స్మరించుకుని వారికి హృదయ పూర్వక శ్రద్ధాంజలి ఘటించారు.. ఈసందర్భంగా దివంగత మిత్రుల చిత్ర పటాల ముందు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సి.హెచ్. వెంకటరావు, ఇతర అతిధులు జ్యోతి వెలిగించి నివాళులు అర్పించారు.. సభ్యులందరూ పుష్పాంజలి ఘటించి, రెండు నిముషాలు మౌనం పాటించారు..

## ప్రతియేటా అక్టోబర్ 2న ఆత్మీయ కలయిక..

2016 నుంచి ప్రతియేటా అక్టోబర్ రెండవ తేదీన క్రమం తప్పకుండా సమావేశమౌతున్నారు. ఐతే, కరోనా పరిస్థితుల ప్రభావం వల్ల 2020, 2021 సంవత్సరాల్లో కలుసుకోలేక పోయినప్పటికీ, గత రెండేళ్ళు రెట్టింపు ఉత్సాహంతో 5వ, 6వ సమావేశాలు నిర్వహించుకోగా, ఈ ఏడాది మరింత ఉత్సాహంతో కలుసుకున్నట్లు కార్యవర్గ సభ్యులు రమేష్ చందర్ చెప్పారు.. ఈ ఏడాది వార్షిక సమావేశానికి ముఖ్యంగా రెండు ప్రత్యేకతలు ఉన్నాయని ముఖ్య సమన్వయ కర్త పోణంగి బాల భాస్కర్ చెబుతూ, మాజీ ఉద్యోగుల అసోసియేషన్ ఆహ్వానాన్ని మన్నించి, అభిమానంతో మాజీ ఛైర్మన్ మానేజింగ్ డైరెక్టర్ ఎన్.రామానుజ దంపతులు ఈ నాటి కార్యక్రమంలో పాల్గొనడం ఒక ప్రత్యేకత.. కాగా బాలానగర్‌లోని డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు మానేజింగ్ డైరెక్టర్‌గా కంటే హెచ్.ఎం.టి. మాజీ ఉద్యోగిగా చెప్పుకోవడమే గర్వకారణంగా భావించే జి.ఆర్.సూర్య రాజ్ తోటి సహోద్యోగుల అందరికీ గోడ గడియారాలు బహూకరించడం మరొక ప్రత్యేకత అని పేర్కొన్నారు.. సభ్యులందరి తరఫున వారికి కృతజ్ఞతలు తెలియజేశారు..

## జ్ఞాపకార్ధంగా బహుమతులు.. శాలువాలతో సత్కారాలు..

మాజీ హెచ్.ఎం.టి.ఉద్యోగి, ప్రస్తుతం బాలాన గర్ లోని డైనమిక్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మానేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న జి.ఆర్. సూర్య రాజ్ తాను సభ్యులందరికీ బహూకరించడానికి తెచ్చిన గోడ గడియారాలలో మొదటి గడియారాన్ని, హెచ్.ఎం.టి. మాజీ ఛైర్మన్, మానేజింగ్ డైరెక్టర్ ఎన్.రామానుజకి అందజేశారు. ఆతర్వాత అసోసియేషన్ వ్యవస్థాపకులు సి.హెచ్.వెంకట్రావు, ప్రస్తుత అద్యక్షులు జి.వి.నరసింహ మూర్తి, కార్యదర్శి ఎన్.వి.మహేష్ తదితర కార్యవర్గ సభ్యులకు కూడా అందజేశారు.. అనంతరం కార్యవర్గ సభ్యు లు అందరూ కలిసి అతిధులను సత్కరించారు. కోశాధికారి సి.హెచ్. నాగలింగం వార్షిక ఆర్థిక నివేదిక సమర్పించగా, సీనియర్ సభ్యుడు గురుబచ్చన్ సింగ్ వందన సమర్పణ చేశారు. కార్యవర్గ సభ్యులు జి.వి.సూర్యనారాయణ, సి.హెచ్.అప్పారావు, అనంత రాములు సభ్యులందరికీ గోడ గడియారాలను అందజేశారు. మహిళా సభ్యులకు రామలక్ష్మి, కనక మహాలక్ష్మి ప్రత్యక బహుమతులను అందజేశారు. చివరిగా మిత్రులందరూ మరో సీనియర్ సభ్యుడు సి.హెచ్.మోహన్ రావు నిర్వహణ లో గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేసి ఒకరికొకరు క్షేమసమాచారాలు తెలియజేసుకుని, వచ్చే ఏడాది దశాబ్ది ఉత్సవాలకు మళ్ళీ కలుసుకుందామని చెప్పుకుని మిత్రులందరు ఒకరికొకరు శలవు తీసుకున్నారు.

# భౌరంపేట్‌లో రోడ్డు విస్తరణ పనులు..

## ఏఈ సురేందర్ నాయక్‌తో కలిసి పనులు పరిశీలించిన కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..



భౌరంపేట్ రోడ్డు విస్తరణ పనుల వద్ద పర్యటిస్తున్న కౌన్సిలర్..





బౌరంపేట్‌లో జేసిబితో రోడ్డు విస్తరణ పనులు..



**దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 2:** రోడ్డు విస్తరణ పనులు నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండేలా చూడాలని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లో మంగళవారం నుండి మొదయిలైన నూతన రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ ఏఈ సురేందర్ నాయక్‌తో కలిసి కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు.. కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత కొంత కాలంగా మిషన్ భగీరథ పనుల కారణంగా రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో రోడ్డును మరింత విస్తరిస్తూ కొత్తగా నిర్మిస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.. ఈ రోడ్డు విస్తరణ వల్లహా భవిష్యత్‌లో గ్రామ అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు ప్రతీ ఒక్కరు కూడా రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడకుండా, అందరూ సహకరించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి,డైరెక్టర్లు సత్తిరెడ్డి, భీం రెడ్డి, మహిపాల్ రెడ్డి,హానాయకులు మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మారెడ్డి, ఆకుల యాదయ్య, కృష్ణా రెడ్డి, గ్రామ నాయకులు, పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో.. గాంధీజీకి నివాళులు..

## మతోన్మాదం సామ్రాజ్యవాదం హింసకు వ్యతిరేకంగా పోరాడటమే గాంధీజీ మార్గం..

## డివైఎఫ్ఐ కుతుబుల్లాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు..




**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, అక్టోబర్ 2:** డివైఎఫ్ఐ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకొని ఘనంగా నివాళులు అర్పించారు.. షాపూర్ నగర్ మెయిన్ రోడ్డుపై ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆది నాగరాజు పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో ఉన్న యువతీ యువకులు మతోన్మాదం సామ్రాజ్యవాదం ఉగ్రవాదం, హింస మదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని దేశ సమైక్యత సమగ్రతలను కాపాడాలని అన్నారు.. కొన్ని మతోన్మాద పార్టీలు గాంధీని చంపిన గాడ్సేను స్వతంత్ర సమరయోధుడిగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.. చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు

కల్పించకుండా ఉపాధి చూపకుండా హిందుత్వ పేరుతో దేవుళ్ళ పేరుతో యువతను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పసుల అంజయ్య, డివైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి కరుణాకర్, మండల కమిటీ శ్రీనివాస్, సభ్యులు ఏ,సంతోష్, మహేందర్ బి. కనకయ్య, యాదవ్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు..

# మహనీయుడికి నివాళులు..



నిజాంపేట్ బస్ స్టాప్ వద్ద జాతి పిత మహాత్మ గాంధీ జయంతి వేడుకలలు ఘనంగా నిర్వహించారు.. కార్యక్రమానికి హాజరైన సిపిఐ మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ గాంధీ విగ్రహనికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.. మండల నాయకులు ఆశి. యాదయ్య, దుర్గయ్య, కె.వాసు, నర్సింహా, జీతయ్య, భాగ్యమ్మ, నర్సమ్మ, అమృత, సత్తమ్మ, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్, పెన్ పవర్, అక్టోబర్ 2:



జగత్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సిపిఐ నాయకులు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కర్యదర్షి ఉమామహేహ్ సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, సహాదేవ్, రాములు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, ప్రజానాట్యమండలి బాబు, సిపిఐ నాయకులు ఇమామ్, శ్రీశైలం, మధు, చంద్రయ్య యువజన సంఘం నాయకులు ఉపేందర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు..



## అంగన్వాడి కేంద్రంలో పురుగుల గడ్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో వచ్చిన గుడ్లల్లో పురుగులు రావటంతో తల్లిదండ్రులు షాక్ తిన్నారు. వల్లంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి స్థానిక అంగన్వాడి సెంటర్ కి వెళ్లి గుడ్లు తీసుకొచ్చాడు. తెచ్చిన గుడ్లను విప్పి చూడగా పురుగులు ఉండడంతో ఒకసారిగా ఆందోళన చెందాడు. పిల్లలకు పౌష్టికాహారం కోసం అందించే గుడ్లలో పురుగులు రావడం, కుళ్ళిపోయిన గుడ్లు కనబడడంతో ఆవేదన వ్యక్తం చేశాడు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కుళ్ళిపోయిన గుడ్లు ఇవ్వడం వల్ల పిల్లలకు తీవ్ర అనారోగ్యం చేస్తుందని చెపుతున్నాడు. తీసుకొచ్చిన గుడ్లను ఇంటిపక్క వాళ్లకు చూపించాడు. అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యతలేని గుడ్లు పంపిణీ చేయవద్దని వారు తెలుపుతున్నారు.

## గాంధీ ఆలోచన, మోదీ సంకల్పాన్ని ముందుకు తీసుకుపోవాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**గాంధీ జయంతి సందర్భంగా సికింద్రాబాద్, ఎంజీ రోడ్డు మహాత్మ గాంధీ చౌక్ లోని గాంధీ విగ్రహానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పూలమాలవేసి నివాళు లార్పించారుజ తరువాత స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ పారడైజ్ కలాసిగూడ పార్క్ లైన్ రోడ్ లోని వీధులన్నీ ఊడ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని పదేళ్ల క్రితం మోది ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. మన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకుంది. స్వచ్ఛత విషయంలో పరిశుభ్రత విషయంలో ప్రభుత్వాలె కాదు ప్రజల సహకారం, భాగస్వామ్యం కూడా అవసరం వుంది. భారత్ అతిపెద్ద దేశం కోట్ల మంది ప్రజలు దేశంలో నివసిస్తున్నారు పరిశుభ్రత స్వచ్ఛత లేకపోతే దేశం, ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఐఏఎస్ నుంచి ఐపీఎస్ వరకు స్కూల్ తరగతి గది నుంచి పట్టణాల వరకు ఈ స్వచ్ఛత కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుతున్నారు ఇది చాలా మంచి పరిణామం. స్వాతంత్ర ఉద్యమం సమయంలో గాంధీ గారు స్వాతంత్రం కావాలా... స్వచ్ఛత కావాలా అని .. అడిగితే.. స్వచ్ఛత ముందు కావాలి.. స్వతంత్రం ఎలాగైనా వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ లో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని అన్ని వర్గాలు ప్రజలకు పిలుపునిచ్చారు. మన పరిసరాలను మన ప్రాంతాల్ని శుభ్రం ఉంచుకోవాల్సిన బాధ్యత మనదే. మన దేశంలో ఆరోగ్యవంతమైన ప్రజలు ఆరోగ్యవంతమైన దేశంగా చూడాలనే లక్ష్యంతో మోదీ ఈ కార్యక్రమాన్ని తీసుకోచ్చారు. స్వచ్ఛభారత్ అంటే ప్రభుత్వ కార్యక్రమం కాదు ఇదో ప్రజా ఉద్యమంగా చూడాలి. జాతిపిత గాంధీ ఆలోచన.. మోది సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నానని అన్నారు

## మహిళ మృతదేహం లభ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యం అయింది. లోధా అపార్ట్మెంట్స్ దగ్గర ఉన్న నిర్మానుష్య ప్రదేశంలోని చెట్ల పొదలలో మృతదేహం పడి వుంది. ఎవరైనా హత్య చేసి మృతదేహాన్ని తీసుకొని వచ్చి ఇక్కడ పడవేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## రికార్డు సృష్టించిన బతుకమ్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అతిపెద్ద బతుకమ్మగా జనగామ బతుకమ్మ గుర్తింపు పొందింది. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో జనగామలో తయారు చేసిన 36.2 అడుగుల భారీ బతుకమ్మ చోటు సంపాదించింది. సెయింట్ మెరిస్ పాఠశాలలో యాజమాన్యం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించింది. 24 గంటల్లో 700 మంది విద్యార్థులతో 36.2 అడుగులతో ప్రపంచంలోనే అతిపెద్ద బతుకమ్మ తయారీ పూర్తయింది. గతంలో ఉన్న 31 అడుగుల బతుకమ్మ రికార్డును బ్రేక్ చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించింది. పాఠశాల యాజమాన్యానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్ ను అందించి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ సభ్యులు సన్మానించారు.

# ప్రజల కోసం ప్రభుత్వం తో పోరాటం చేస్తా

## టీపీసీసీ నేత మధు యాష్కి

**హైదరాబాద్ పెన్ పవర్:**టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ చైతన్యపురి లోని మూసి పరవాక ప్రాంత ప్రజలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం కూల్చివేత పై నిర్ణయం తీసుకుంటే ఒక న్యాయవాదిగా పోరాడుతానని,అదే విధంగా ప్రభుత్వం తో కూడా ప్రజల తరపున పోరాటం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూల్చివేతలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు అని,బ్లూ మార్కుకి సంబంధం లేదని ప్రజలకు భరోసానిచ్చే ప్రయత్నం చేశారు మధు యాష్కి.

# ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ

**హైదరాబాద్ పెన్ పవర్:**సేవరేజ్ ఓవర్ ఫ్లో, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. గాంధీ జయంతి సందర్భంగా ఈరోజు నుంచి 90 రోజుల వరకు హైదరాబాద్ నగరంలో వర్షం నీరు వృథాగా కాకుండా భూగర్భ జలాల పరిరక్షణకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని మంత్రి పొ?నం ప్రభాకర్ అన్నారు. వర్షం నీరు బయటికి పోకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. అపార్ట్మెంట్స్, కాలనీలు అందరూ పాటించాలి. మూడు నెలల్లో సేవరేజి సమస్య 30 శాతానికి తగ్గించాలన్నదే మా ఉద్దేశ్యం. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది. 1950 ఎంఎల్టీ మురుగు నీరు వస్తుంది..వాటిని ఎస్టీపీ ద్వారా శుభ్రత అయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

# హైడ్రాకు హైపవర్

## విస్తృతాధికారాలు ఇచ్చిన ప్రభుత్వం

## ఆర్డినెన్స్కు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా)కి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్కు మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు హైడ్రాకు ఈ ఆర్డినెన్స్ రక్షణగా ఉండనుంది. ఇటీవల ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. వాటిని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ నివృత్తి చేయడంతో గవర్నర్ ఆమోదముద్ర వేశారు.

# మహాత్మా గాంధీకి వైఎస్ జగన్ నివాళులు



**హైదరాబాద్ పెన్ పవర్:**జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్.జగన్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, వైఎస్సార్సీపీ నేత కొమ్మూరి కనకారావు తదితరులు పాల్గొన్నారు.

# అవార్డు అందుకోవాలి.. బెయిల్ ఇవ్వాలంటూ కోర్టులో జానీ మాస్టర్ పిటిషన్!

- అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగికవేధింపుల కేసులో అరెస్టయిన జానీ మాస్టర్
- ఈ నేపథ్యంలోనే అతనిపై పోక్సో కేసు నమోదు
- ఇటీవల జానీ మాస్టర్‌కు బెస్ట్ కొరియోగ్రాఫర్ అవార్డు
- ఈ పురస్కారం అందుకునేందుకు బెయిల్ ఇవ్వాలని కోర్టులో పిటిషన్



**హైదరాబాద్ పెన్ పవర్:**అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల నేపథ్యంలో పోక్సో కేసులో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అరెస్టయిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా తాను అవార్డు అందుకోవాలని, తనకు 5 రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నార్సింగ్ పోలీసులకు ఇచ్చిన నాలుగు రోజుల కస్టడీ ముగియడంతో జానీని మళ్లీ ఉప్పరపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. అనంతరం అతడిని చంచల్ గూడ జైలుకు తరలించారు. 'నాకు ఇటీవల ఉత్తమ నృత్యదర్శకుడిగా అవార్డు వచ్చింది. దానికోసం ఢిల్లీ వెళ్లి అవార్డు అందుకోవాల్సి ఉంది. అందుకుగాను ఐదు రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వండి' అని జానీ కోర్టును కోరాడు. కాగా, ఈ పిటిషన్‌పై ఈ నెల 7న విచారణ చేపడతామని రంగారెడ్డి పోక్సో కోర్టు పేర్కొంది. మరోవైపు కొరియోగ్రాఫర్ బెయిల్ పిటిషన్‌ను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు కౌంటర్ పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. నిందితుడిని బయటకు వదిలితే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందంటూ అతడికి బెయిల్ మంజూరు చేయొద్దని తమ పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

# బెంగళూరులో ట్రాఫిక్ జామ్.. రోడ్డు పక్కన డ్యాన్స్ చేస్తున్న యువకులతో కలిసి చిందేసిన యువతి..

### ట్రాఫిక్ జామ్ కారణంగా ఆగిన ఆటో

### రోడ్డుకు ఆవలిపక్కన డ్యాన్స్ చేస్తున్న యువకుల వద్దకు వెళ్లి చిందేసిన యువతి

### కామెంట్లతో హోరెత్తిస్తున్న నెటిజన్లు



**హైదరాబాద్ పెన్ పవర్:**ట్రాఫిక్ జామ్‌లకు బెంగళూరు పెట్టింది పేరు. షరా మామూలుగా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న ఓ యువతి ఆటో దిగి రోడ్డు పక్కన డ్యాన్స్ పార్టీలో చిందులేసి మళ్లీ ఆటో ఎక్కిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీడియో ప్రకారం యువతి తన స్నేహితురాలితో ఆటోలో ప్రయాణిస్తోంది. ట్రాఫిక్ జామ్ కారణంగా ఆటో ఆగింది. అదే సమయంలో రోడ్డుకు ఆవలి పక్కన కూడా ట్రాఫిక్ జామ్ కారణంగా ఓ డ్యాన్సర్ గ్రూపు ఆగింది. వారి డ్యాన్స్‌ను చూసి ఉత్సాహం ఆపుకోలేకపోయిన యువతిని స్నేహితురాలు ప్రోత్సహించింది. 'వెళ్లె వెళ్లు' అని అనడం వీడియోలో వినిపించింది. వెంటనే రోడ్డు దాటిన ఆమె డ్యాన్స్ చేస్తున్న వారి వద్దకు వెళ్లి వారితో కలిసి స్టెప్పులేసింది. దీంతో వారు మరింత ఉత్సాహంగా చిందులేశారు. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న ఇతర ప్రయాణికులు కూడా దీనిని ఎంజాయ్ చేశారు. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో ఇప్పటి వరకు 1.3 మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుంది. ఇక కామెంట్లకు అయితే లెక్కేలేదు. ఆమె అక్కడికి వెళ్లగానే డ్యాన్స్ గ్రూపులోని వారి ఉత్సాహం రెట్టింపు అయిందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తానీరోజు చూసిన బెస్ట్ వీడియోల్లో ఇదొకటని మరో యూజర్ కామెంట్ చేశాడు.

# ఇలాగే ముందుకెళ్తే బంగ్లాదేశ్ పరిస్థితులు దాపురిస్తాయి.. రేవంత్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**హైడ్రా కూల్చివేతలపై బీఆర్ఎస్ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ఇలాగే కూలుస్తూ పోతే బంగ్లాదేశ్‌లో ఇటీవల తలెత్తిన పరిస్థితులే ఇక్కడా వస్తాయని హెచ్చరించారు. నిన్న ఓల్డ్ బోయినపల్లిలోని హస్మత్‌పేటలోని బోయిన్ చెరువును పరిశీలించిన ఆయన స్థానికులతో మాట్లాడారు. శని, ఆదివారాలు వస్తున్నాయంటే చెరువుల సమీపంలో నివసిస్తున్న పేదల గుండెల్లో గుబులు మొదలవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలను లక్ష్యంగా చేసుకోవడం తగదని ప్రభుత్వానికి హితవు పలికారు. కూకట్‌పల్లి సున్నం చెరువు సమీపంలోని పద్మావతి నగర్ నివాసితులకు హైడ్రా అధికారులు నోటీసులు జారీచేసిన నేపథ్యంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే తన పర్యటన సందర్భంగా హరిజన్ బస్తీ వాసులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# వేలాదిమందిపై వేటు వేసేందుకు సిద్ధమైన శాంసంగ్!

**మొత్తం ఉద్యోగుల్లో 10 శాతం మందిని ఇంటికి పంపే యోచన**

**సొంతదేశం కొరియాలో కాకుండా విదేశీ సిబ్బందిపైనే వేటు**

**గతంలోనూ ఇండియా, లాటిన్ అమెరికాలోని ఉద్యోగులను ఇంటికి పంపిన సంస్థ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని వేలాదిమంది ఉద్యోగులను తొలగించేందుకు దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్ దిగ్గజం శాంసంగ్ సిద్ధమైంది. మొత్తం ఉద్యోగుల్లో పదిశాతం మందిపై వేటు వేసేందుకు శాంసంగ్ కత్తులు నూరుతున్నట్టు 'బ్లూమ్‌బర్గ్' తెలిపింది. శాంసంగ్‌లో మొత్తం 2,67,800 మంది ఉద్యోగులుండగా విదేశాల్లో శాంసంగ్‌కు దాదాపు 1.47 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సొంత దేశంలో కాకుండా విదేశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపైనే వేటుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

సింగపూర్ కంపెనీలోని హెచ్‌ఆర్ మేనేజర్లు ఇప్పటికే ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి లేఆఫ్‌ల ప్రకటన చేశారు. అలాగే, ఈ సందర్భంగా ఇవ్వబోయే ప్యాకేజీల గురించి కూడా వెల్లడించినట్టు తెలిసింది. అయితే, తప్పనిసరిగా పలానా విభాగంలోనే ఉద్యోగులను తొలగించాలన్న నియమం పెట్టుకోలేదని శాంసంగ్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. శాంసంగ్ ఈ ఏడాది భారీ ఒడుదొడుకులకు లోనవుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెమరీ చిప్స్, స్మార్ట్‌ఫోన్ మేకర్ అయిన శాంసంగ్ షేర్లు ఈ ఏడాది 20 శాతానికిపైగా పతనమయ్యాయి. శాంసంగ్ గతంలోనూ వర్క్‌ఫోర్స్‌ను తగ్గించింది. ఇండియా, లాటిన్ అమెరికాలో 10 శాతం సిబ్బందిని ఇంటికి పంపింది. ఇప్పుడు విదేశాల్లో పనిచేస్తున్న 1.47 లక్షల మందిలో మరో 10 శాతం మందిని ఇంటికి పంపాలని నిర్ణయించింది.

# హీరోయిన్ల గురించి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్

**నేను హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేశానని కొండా సురేఖ అనలేదా? అని ప్రశ్న**

**నాకు కుటుంబం, పిల్లలు లేరా? అని ప్రశ్నించిన కేటీఆర్**

**కొండా సురేఖ ఏడిస్తే తమకు సంబంధం లేదని వ్యాఖ్య**





**హైదరాబాద్ పెన్ పవర్:** హీరోయిన్లకు సంబంధించి మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ చేశానని కొండా సురేఖ అనలేదా? నాకు కుటుంబం, భార్యాపిల్లలు లేరా? అని నిలదీశారు. ఆమెపై సోషల్ మీడియా పోస్టులతో తమకు సంబంధం లేదన్నారు. కొండా సురేఖ ఏడిస్తే తమకు సంబంధం లేదని చెప్పారు. మాపై ఆరోపణలు చేసినప్పుడు మా ఇంట్లో ఆడవాళ్లు బాధపడరా? వారు ఏడవరా? అని నిలదీశారు.

కాంగ్రెస్ నేతలు ఇదివరకు మాట్లాడిన బూతులను గుర్తుకు తెచ్చుకోవాలని వ్యాఖ్యానించారు. వారు తిట్టినప్పుడు ఇతరుల మనోభావాలు దెబ్బతినలేదా? అని ప్రశ్నించారు. కొండా సురేఖ, సీతక్కలు సీఎం రేవంత్ రెడ్డి నోరును ఫినాయిల్‌తో కడగాలని సూచించారు. సోషల్ మీడియాలో కేసీఆర్‌ను తిట్టిపోసినప్పుడు మాట్లాడలేదన్నారు.

చేతకాకనే కాంగ్రెస్ తమపై దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేక దాడులు చేయిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ లేకుండా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబులు మూసీ ప్రాంతంలో తిరగాలని సవాల్ చేశారు. జగ్గారెడ్డి, మధు యాష్కీలు హైడ్రాను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఓ అండర్‌స్టాండింగ్ ఉందని ఆరోపించారు. అందుకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంటిపై ఐటీ దాడుల గురించి బీజేపీ మాట్లాడటం లేదన్నారు. మూసీ బాధితుల కోసం రేపు ఎల్బీ నగర్‌కు వెళుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ వాళ్ళు అడ్డొస్తే ఏం చేయాలో అది చేస్తామని హెచ్చరించారు. తమకు ఆత్మరక్షణ కూడా ముఖ్యమే అన్నారు.

## పెనుబల్లిలో చోరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ హై స్కూల్ దగ్గర ఇంటిలో చోరీ జరిగింది. గోపాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్ళాడు. ఇంట్లో ఎవ్వరూ లేరని సమయంలో దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు.

80 గ్రాములు బంగారం, లక్ష 30 వేల రూపాయల నగదును దోచుకు వెళ్లారు. ఊరి నుంచి తిరిగి వచ్చిన గోపాలకృష్ణారెడ్డి కి ఇంటి తాళం పగుల గొట్టి ఉండటం గమనించి. వీఎం బంజర పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ చోరీ తెలిసిన వారి పనే అయి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. చోరికి గురైన ఆరు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఒక లక్ష ముప్పై వేలు నగదును దుండగులు అపహరించుకు పోయినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

# మైనర్ బాలికను గర్భవతిని చేసిన వృద్ధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** వరంగల్ జిల్లాలో మరో దారుణం జరిగింది. ఒక వృద్ధుడు మైనర్ ను గర్భవతిని చేసాడు. 13 సంవత్సరాల బాలికపై 65 ఏళ్ల వృద్ధుడు సాంబయ్య లైంగిక దాడి జరిపాడు. కడుపునొప్పి రావడంతో బాలికను వరంగల్ లోని సికేఏం ఆసుపత్రికి తల్లి తీసుకువచ్చింది. వైద్యులు నాలుగు నెలల గర్భవతి గా నిర్ధారించారు. దాంతో బాలిక కుటుంబం గీసుగొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసారు

# మల్లన్న సేవలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ శైవ క్షేత్రం, ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి నీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున మంత్రి దామోదర్ రాజనర్సింహ తన కుటుంబ సభ్యులతో దేవస్థానం కి చేరుకోగానే ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం, స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో తులాభారం లో తన బరువుకు సరిసమానమైన బెల్లంను స్వామివారికి సమర్పించుకున్నారు. ఆలయ అర్చకులు ఇచ్చిన పలహారాలను స్వీకరించారు.

# కూతురికి డిక్లరేషన్ ఇచ్చిన పవన్ కళ్యాణ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిన్న కుమార్తె పలీనా అంజని కొణిదెల తిరుమల శ్రీవారి దర్శనానికి డిక్లరేషన్ ఇచ్చారు. టిటిడి ఉద్యోగులు తీసుకువచ్చిన డిక్లరేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. పలీనా అంజని మైనర్ అయినందున తండ్రిగా పవన్ కళ్యాణ్ కూడా ఆ పత్రాలపై సంతకాలు చేశారు.

## బాపూజీకి గవర్నర్, మంత్రి పొన్నం నివాళులు

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాపు ఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం కలిసి మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు.

## రజనీకాంత్ ను ఫోన్ లో పరామర్శించిన ఏపీ సీఎం చంద్రబాబు రజనీకాంత్ కు స్టెంట్ వేసిన అపోలో వైద్యులు

**హైదరాబాద్ పెన్ పవర్:**గుండెకు రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళం దెబ్బతినడంతో ప్రముఖ నటుడు రజనీకాంత్ కు చెన్నై అపోలో ఆసుపత్రి వైద్యులు స్టెంట్ వేయడం తెలిసిందే. రజనీకాంత్ ప్రస్తుతం ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు... రజనీకాంత్ ను ఫోన్ లో పరామర్శించారు. రజనీకాంత్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రజనీకాంత్ త్వరగా ఆరోగ్యవంతుడవ్వాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

కాగా, రజనీకాంత్ గత రాత్రి ఆసుపత్రిలో చేరడంతో అభిమానుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. రజనీకి ఏమైందో తెలియకపోవడంతో, సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వ్యాప్తి చెందాయి. బుధవారం చెన్నై అపోలో ఆసుపత్రి వర్గాలు రజనీకాంత్ హెల్త్ బులెటిన్ విడుదల చేయడంతో ఊహాగానాలకు అడ్డుకట్ట పడింది.

## ఆమానవీయంగా ప్రవర్తిస్తున్న రేవంత్ ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:**మహాత్ముడు గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా తెలంగాణ భవన్లో వారి చిత్రపటాలకి పూలమాలలు వేసి భారత రాష్ట్ర సమితి కేటీఆర్ మరియు పార్టీ సీనియర్ నాయకులు నివాళులు అర్పించారు.

కేటీఆర్ మాట్లాడుతూ తన సత్యాగ్రహంతో భారతజాతినే కాకుండా ప్రపంచాన్ని మేల్కొల్పిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమందికి స్ఫూర్తినిస్తూ అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా లాంటి నాయకులకు స్ఫూర్తినిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ. ఆయన జయంతి సందర్భంగా దేశ ప్రజలందరికీ జన్మ దిన శుభాకాంక్షలు. సమాజంలో ఉండే అత్యంత బలహీనమైన వ్యక్తిని, ఆ సమాజం, ఆ ప్రభుత్వం ఎట్లా ఆదరిస్తున్నదనే దాన్నిబట్టి ఆ ప్రభుత్వం యొక్క వ్యవస్థ యొక్క గొప్పతనం తెలుస్తుందని మహాత్మా గాంధీ స్వయంగా చెప్పారు. ఈ మాట సరిగ్గా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పుడు గుర్తు చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.

సమాజంలోని బలహీనుల పట్ల కర్కశత్వంతో వ్యవహరించాల్సిన అవసరం లేదు. ఈ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తుంది ఈ అంశంలో పునరాలోచించుకోవాలి. రాష్ట్రంలోని ప్రజలు పేదలంతా బాధపడుతున్నారు. ఇండ్లు కూల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కూలీలు కూడా ఇల్లు కూలగొట్టలేమంటూ మాతో తిరిగి వెళ్ళిపోయారు. ప్రజలు మిమ్మల్ని గెలిపించింది నిర్మాణాత్మక పనులు చేయమని కానీ విధ్వంసం సృష్టించమని కాదనే విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలుసుకోవాలి . మేము రెండున్నర లక్షల ఇండ్లు కడితే మిమ్మల్ని అయిదు లక్షల ఇల్లు కట్టమని ఓటేసినారు కానీ ఉన్న ఇండ్లను కూలగొట్టమని కాదు. కానీ సమాజంలోని అత్యంత వెనుకబడిన వారిపట్ల కర్కషంగా అమామానవీయంతో వ్యవహరిస్తున్న ఈ కాంగ్రెస్ సర్కారు తీరు బాధాకరమని అన్నారు.

ఈ గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలో ఉన్న ప్రస్తుత గాంధీలు ఈ ప్రభుత్వ అమానవీయమైన పాలనపై స్పందించాలి. డి పి ఆర్ అనేది లేకుండా ఇండ్లు కులగొట్టే దుర్మార్గమైన ప్రయత్నాలను విరమింపచేయాలి. మానవత్వంతో ముందడుగు వేయాలని ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# రైల్లో వస్తున్న గంజాయి పట్టివేత..

**హైదరాబాద్ పెన్ పవర్:**విశాఖపట్నం నుంచి హైదరాబాద్ కు వస్తున్నటువంటి గోదావరి ఎక్స్ ప్రెస్ లో ముగ్గురు వ్యక్తులు గంజాయిని తీసుకు వస్తున్నారని సమాచారం వచ్చింది. డైరెక్టర్ ఆఫ్ ఎన్ ఫోర్స్ మెంట్ విబి కమలాసన్ రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ బి టీం పోలీసులు బుధవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో గంజాయిని పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ కి చెందిన సైదులు,. వెస్ట్ బెంగాల్ కు చెందిన సుమన్ సెన్, ఎండి సోహెల్ లు కలిసి గోదావరి ఎక్స్ప్రెస్ లో 20 కిలోల చొప్పున బ్యాగులో నింపుకొని హైదరాబాద్కు తీసుకొని వస్తున్న సందర్భంగా వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు వీరిని పట్టుకున్నారు. గంజాయి విలువ రూ. 12 లక్షల మేరకు ఉంటుందని అంచనా వేశారు. ఎస్టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావు, ఎస్సైలు బాలరాజు, సంధ్య ఇతర సిబ్బంది ఉన్నారు.




# విశ్వశాంతికి బాటలు వేసిన బాపూజీ

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి మహాత్మాగాంధీ జయంతి అక్టోబర్ 2 పురస్కరించుకొని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. శాంతి, సత్యాగ్రహం, సహాయనిరాకరణ వంటి ఆయుధాలతో బ్రిటీషు వారితో చివరకంటూ పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ఒక గొప్ప పోరాడు యోధుడు మహాత్మా గాంధీ అని ఆయన కొనియాడారు. ప్రపంచానికి శాంతి అనే ఆయుధాన్ని పరిచయం చేసి.. విశ్వశాంతికి బాటలు వేసారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గుర్తుచేశారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు కమ్ముకున్న పరిస్థితుల్లో.. జాతిపిత మాహాత్మగాంధీ చూపిన శాంతి మార్గమే ప్రపంచ మనుగడకు మార్గమని ఆయన అన్నారు. ఈ దేశంలో పౌరులు హక్కులతో పాటు తమ బాధ్యతలను నెరవేర్చినప్పుడే ఈ దేశం అగ్రగామిగా నిలుస్తుందని చెప్పిన బాపూజీ మాటను మనమంతా పాటించాలని ఆయన సూచించారు.

# ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తాం డూర్ మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్,ఏమార్వో కార్యాలయంలో ఏమార్వో ఇమ్రాన్ ఖాన్,తాండూర్ గ్రామపంచాయితి కార్యాలయంలో

ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్,ఏమార్వో ఇమ్రాన్ ఖాన్ లు మాట్లాడుతూ అహింస, సత్యం, శాంతి మార్గాలను చూపిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని వారు సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరు ప్రయాణిస్తే విజయాలు సాధించడం చాలా సులువని,200 సంవత్సరాలు పాలించిన బ్రిటిష్ వారిని అహింసా మార్గంలో దేశం నుంచి పారద్రోలి భరతమాతకు భారతదేశానికి స్వేచ్ఛ వాయువులు ప్రసాదించారంటే వారు పాటించిన అహింస మార్గమే అందుకు కారణమని అటువంటి గొప్ప మార్గాన్ని నేడు ప్రపంచం మొత్తం పాటిస్తున్నారని, అదేవిధంగా సత్యానికి చాలా బలం ఉంటుందని అది అవినీతిపరులను అక్రమార్కులను ప్రశ్నిస్తుందని సత్యాన్ని ఆచరించే వ్యక్తి ఎటువంటి వ్యక్తినైనా ఎదిరిస్తారని అది సత్యం తాలూకా గొప్పతనం అని ఆచరణలో చూపిన వ్యక్తి గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గిరిధార్,మాజీ జడ్పిటీసీ సాలిగామ బాణయ్య,దత్తుమూర్తి,మహేందర్ రావు,ఎల్క రాంచందర్,సూరం రవీందర్ రెడ్డి,పేరం శ్రీనివాస్,గట్టు మురలీధర్,సిరంగి శంకర్,మహమ్మద్ అబ్బాధ్ బాబా,దాతత్రేయ రావు,



దామోదర్,రాజేశం,లక్ష్మణ్,మాజీ కోఆప్షన్ రెహమాత్ ఖాన్,మాస వెంకటస్వామి,కాంపెల్లి చిన్నయ్య,కార్యదర్శి శ్రీనివాస్,దివాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శం

**హైదరాబాద్ పెన్ పవర్:**మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవనం గురించి మనం చిన్నప్పటి నుంచి చదువుతు న్నామని అన్నారు. నేటి సమాజంలో మనందరం తొందరగా ఫలితాలు రావాలని ఆశిస్తున్నామని , గాంధీ జీవితంలో ఎప్పుడు షార్ట్ కట్స్ వెతుక్కోలేదని, న్యాయబద్ధం గా ఓపికతో పోరాడుతూ అనేక విజయాలు సాధించారని అన్నారు. స్వాతంత్ర ఉద్యమం లో భాగంగా జరిగిన క్విట్ ఇండియా, విదేశీ వస్త్రాల బహిష్కరణ మొదలగు ఉద్యమాలు ఒక్కరోజులో వచ్చినవి కావని, గాంధీ మహనీయులు ప్రతి రోజూ నమ్మిన సిద్ధాంతం ప్రకారం నిరంతరాయంగా చేసిన కృషి ఫలితంగా ఉద్యమాలు

సఫలీకృతం అయ్యాయని, ఒక్కరోజులో ఫలితం రాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ జైలు శిక్ష అనుభవించడం వంటి అనేక కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, లక్ష్యాన్ని సిద్ధాంతాన్ని మరిచిపోకుండా పోరాటం సాగించారని, దాని వల్ల ఆశించిన ఫలితం లభించి మన దేశానికి స్వాతంత్రం వచ్చిందని, దీనిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, నిరంతరాయంగా లక్ష్యం కోసం శ్రమిస్తే ఫలితం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. మన నిత్య జీవితంలో అనేక ఒత్తిడులు వస్తాయని, అటువంటి అవరోధాలను ఎదుర్కొంటూ మన లక్ష్యాల సాధనకు నిరంతరాయంగా శ్రమించాలని అన్నారు. అనంతరం మహాత్మ గాంధీ స్మారక నిధి వారు రూపొందించిన మహాత్మ గాంధీ సూక్తుల పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డి.ఎం. అండ్ హెచ్. ఓ. డాక్టర్ ప్రమోద్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సి. సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాని వెంకటేశం, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.